# ఓటున్న బాబుల్లారా!

## మినీ కథ

వర్షాకాలం వచ్చినంత చీదరగానూ మున్సిపల్ ఎలక్షన్లొచ్చాయి.

ధర్మనాయుడుగారికి భీమరాజు, అర్జునరావు అని ఇద్దరు తమ్ముళ్ళున్నారు.

వర్షాకాలం రావడానికీ మున్సిపల్ ఎలక్షన్లు రావడానికిగల సంబంధం రెండూ చీదరగా వుండడం

మరయితే .

మున్సిపల్ ఎలక్షన్లు రావడానికీ ధర్మనాయుడిగారికి ఇద్దరు తమ్ముళ్ళుండడానికీ గల సంబంధం ఏమిటి?

లేకేం... ఉంది.. బోలెడంత వుంది.

ధర్మనాయుడుగారు అధికార పార్టీ తరపున తన వార్డులో పోటీ చేస్తున్నారు.

తమ పలుకుబడిని ఉపయోగించి తమ్ముడు భీమరాజుకు ప్రతిపక్షం తరపున అదే వార్డులో సీటిప్పించారు

మూడోవాడు అర్జునరావు ఉమ్మడి పార్టీ తరపున అదే వార్డులో పోటీ చేస్తున్నాడు

వీళ్ళలో ఎవరు నెగ్గినా పదవి వాళ్ళ కుటుంబంలోనే వుంటుంది.

ఓహ్....ఏం ఆలోచన?

ధర్మనాయుడిగారి తెలివికి జోహార్లు.

వీళ్ళు ముగ్గురే గాకుండా ఒకళ్ళిద్దరు సత్రగాయలు కూడా ఆ వార్డులో పోటీ పడి మైకుల్లో అరుచుకుంటున్నారు.

ఇంకా అక్కడా అక్కడా భీమరాజు, అర్జునరావు ప్రచారం చేసుకుంటున్నారు గానీ ధర్మనాయుడు గారు మాత్రం కిమ్మనకుండా నిమ్మకునీరెత్తినట్టు కూర్చున్నారు.

ఆయనకి తెలుసు తనని గెలిపించేదేమిటో.

ఈ మైకులు, ఈ కేకలుగాదు తనని గెలిపించేవి లక్ష్మీకటాక్షం.

తన దగ్గరున్న లక్ష్మి ఓటరుని కటాక్షిస్తే ఓటరు తనని కటాక్షిస్తాడు.

ఇది ఆయనకి అనుభవం నేర్పిన పాఠం

ఎలక్షను రేపనగా పేటలోవున్న ముగ్గురు నలుగురు లీడర్సుని పిలిపించేరు

## 'సింహం'




వాళ్ళ చేతుల్లో పుష్కలంగా డబ్బు పెట్టేరు ఓటుకి పదిహేను రూపాయలైనా ఫరవాలేదన్నారు. ఇంకా కావలిసొస్తే తననొచ్చి అడగమన్నారు.

ప్రచారమే చెయ్యని ధర్మనాయుడు గారు బంపర్ మెజారిటితో గెలిచారు.

తమ పలుకుబడితో చైర్మన్ కూడా అయ్యారు.

తమ పేటలో మురికివాడల లీడర్లు వచ్చారు తమ వాడలో కుళాయిలు వేయించమని అడగడానికి

వేయించను పొమ్మన్నారు ధర్మానాయుడుగారు.

“ఎందుకు వేయించరు? మేం ఓట్లేస్తేనేగదా మీరు గెలిచింది!” అన్నారు లీడర్లు.

“మీరు నా మీద ప్రేమతో నాకు ఓట్లెయ్యలేదు నా డబ్బు తిన్నారు. నాకు ఓట్లేసేరు. అక్కడితో అది చెల్లు నేను మీకు చెయ్యవలసిన అవసరంలేదు. నా డబ్బు తినని వాళ్ళకే నేను సేవ చేస్తాను.” అన్నారు ధర్మనాయుడుగారు

ఇంతకీ శ్రీవారి డబ్బు తినకుండా సేవచేసిన ఉత్తమ మానవులున్నారా అని!

లేకేం... ఉన్నారు.

కంట్రాక్టర్లు!! ★

గమనిక : “ఒకే రకం” రచయిత శ్రీ ఎం. వి వి. సత్యనారాయణగారి పేరు 49 వ పేజీలో ముద్రణ జరగనందుకు చింతిస్తున్నాము -సం.